క్లుప్తంగా

ఆరుగురిపై కేసు నమోదు

ఎల్కతుర్తి : ప్రేమించి ముఖం చాటేశాడని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమండ్రిలోని చిన్నకోడెపుడి గ్రామానికి చెందిన చిడిపి చంద్రకళ, భీమదేవపల్లి మండలం ముల్కనూరుకు చెందిన బొల్లపల్లి రంజిత్ రాజమండ్రిలోని ఓ ఆస్పత్రిలో పనిచేసేవారు. ఈ క్రమంలో ఒకరినొకరు ప్రేమించుకున్నారు. రంజిత్ సహజీవనం చేసి ప్రేమ విషయం ఇంట్లో వాళ్లకి చెప్పి వస్తానని స్వగ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి ముఖం చాటేసి చంద్రకళకు దూరంగా ఉంటున్నాడు. కాగా రంజిత్ చంద్రకళతో కాపురం చేసేందుకు సుముఖంగా ఉన్నాడని, కానీ అతడి కుటుంబ సభ్యులు మాయమాటలు చెప్పి తనకు దూరంగా ఉంచుతున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో చంద్రకళ తన కుంటుంబ సభ్యులతో కలిసి ముల్కనూరులోని రంజిత్ ఇంటికి వచ్చి అడుగగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ చంద్రకళను బెదించినట్లు ఫిర్యాదు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు రంజిత్ కుటుంబ సభ్యులైన తండ్రి బొల్లంపల్లి రామచంద్రం, తల్లి కనకలక్ష్మి, అన్న రాజు, సోదరీలు రమాదేవి, ధనలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం


అనూష

వేలేరు : కళాశాలకు వెళ్తున్నానని చెప్పిన యువతి సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో విద్యార్థిని తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన వేలేరు మండలం శాలపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాలపల్లి గ్రామానికి చెందిన మండల రవికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు అనూష హనుమకొండలోని జాగృతి డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం 9 గంటలకు కాలేజీకి వెళుతున్నాను అని ఇంట్లో చెప్పి వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో తండ్రి రవి కళాశాలకు వెళ్లి ఆరా తీశాడు. దీంతో ఆరోజు అనూష కాలేజీకి రాలేదని అధ్యాపకులు తెలిపారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదని, ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన సుమన్ అనే వ్యక్తి తన కూతురిని తీసుకెళ్లి ఉంటాడని యువతి తండ్రి అనుమానిస్తూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఆత్మకూరు : మండల కేంద్రంలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న పాండవుల రఘుపై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు. మద్యాన్ని అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. రఘుపై కేసు నమోదు చేసి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

సమాజసేవ శిక్ష విధించిన కోర్టు

ధర్మసాగర్ : మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రెండోరోజులు సమాజసేవ చేయాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన సంగి సారయ్య బుధవారం మద్యం సేవించి కారు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో సారయ్యను శుక్రవారం రెండోతరగతి కోర్టు న్యాయమూర్తి విద్యాసాగర్ రావు ఎదుట హాజరు పర్చగా.. మద్యం సేవించి వాహనం నడపడాన్ని నేరంగా పరిగణిస్తూ ఆ వ్యక్తికి రెండురోజులు సమాజసేవ చేయాలని తీర్పు ఇచ్చారు. దీంతో పోలీసులు స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పర్చినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

నేటి ధర్నాకు రైతులు తరలిరావాలి

దామెర /ఆత్మకూరు : రుణమాఫీపై మాటతప్పిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు శనివారం నిర్వహించతలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని కొత్త బస్‌స్టాండ్ సమీపంలో శనివారం ఉదయం 10 గంటలకు ధర్నా ఉంటుందని, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. మండలంలోని రైతులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే ఆత్మకూరు మండల కేంద్రంలో శనివారం నిర్వహించతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సంజీవరెడ్డి, కుమారస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

సంస్కృత భాషా దినోత్సవం

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ సంస్కృత భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ సంస్కృతంపై కూడా విద్యార్థులు ఆసక్తి చూపాలని కోరారు.

దోమల నివారణకు చర్యలేవి?

- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్
- మురుగునీటితో కంపుకొడుతున్న గ్రామాలు
- వ్యాధుల బారిన పడుతున్న స్థానికులు


ధర్మారంలో నిల్వఉన్న మురుగునీరు

నడికూడ : మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరద నీరు పోయేందుకు సరియైన డ్రెయినేజీలు లేకపోవడంతో నీరు నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వ్యాప్తి విపరీతంగా పెరిగిపోవడంతో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు మొర పెట్టుకుంటున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వరద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు. దోమల నివారణకు అన్ని గ్రామాలలో సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు ఫాగింగ్ మిషన్‌ను రూ.14 నుంచి రూ. 18వేలు వరకు వెచ్చించి కొనుగోలు చేశారని, కానీ వాటిని వినియోగించడం లేదని అంటున్నారు. వానాకాలం ముగిసేవరకు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్‌ను వేయడం వలన దోమలను నివారించవచ్చని ఉన్నతాధికారులు సూచిస్తున్నా మండల స్థాయి అధికారులు పెడచెవిన పెడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పారిశుధ్యం దృష్టి సారించి, బ్లీచింగ్, స్ప్రే చేయించి, డ్రెయినేజీల శుభ్రం, చెత్తాచెదారాన్ని తొలగించి, గుంతల్లో నీటినిల్వలు లేకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తునారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పలువురు కోరుతున్నారు.

ప్రత్యేకాలంకరణలో పార్వతి అమ్మవారు



దామెర : మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలోని పార్వతి అమ్మవారు భక్తులకు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని చర్రీ పండ్లు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగిళ్ల రాజుశర్మ వేద మంత్రోచ్చరణ నడమ కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం భక్తులు అలిత సహస్త పారాయణం పఠించారు. అంతకుముందు గ్రామానికి చెందిన శిరూరి పావని సుగుణాకర్ రావు, రజిత రత్నాకర్ రావు దంపతులు పరమేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ధూపదీప, నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


బుచ్చిరెడ్డి

ఆత్మకూరు : పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆత్మకూరు మండల అధ్యక్షుడిగా అబ్బు బుచ్చిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆ సంఘం మండల సర్వసభ్య సమావేశం జరుగగా నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా అబ్బు బుచ్చిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా భుజంగరావు, మండల అసోసియేట్‌గా కె.ప్రభాకర్, మండల ఉపాధ్యక్షురాలుగా గ్రేసమ్మ, కార్యదర్శిగా కిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా సూరిబాబు, చంద్రమోహన్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి పలిత శ్రీహరి, రాష్ట్ర అసోసియేట్ సభ్యుడు ఉపేందర్‌రెడ్డి, ములుగు జిల్లా ప్రధానకార్యదర్శి యాకుబ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామ కన్వీనర్‌గా భూపతిరాజ్

వేలేరు : బీఆర్ఎస్ పార్టీ వేలేరు గ్రామ కన్వీనర్‌గా ఇట్టబోయిన భూపతిరాజ్‌ను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నియామకం

హన్మకొండ (పరకాల): బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాలకుర్తి తిరుపతిని నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ కోకన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన నత్తి కోర్నెల్‌ను నియమిస్తూ స్టేట్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కోర్నెల్ మాట్లాడుతూ.. తనను నియమించినందుకు ప్రీతమ్‌తో పాటు మంత్రులు సీతక్క, సురేఖ, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం


మాట్లాడుతున్న బొట్ల చక్రపాణి

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మాజీ రాష్ట్ర నాయకుడు బొట్ల చక్రపాణి విమర్శించారు. హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్యభవన్‌లో ఎస్ఎఫ్ఐ విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని మతోన్మాద ఊబిలోకి దించుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి చుక్కయ్య మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానంలో మార్కెట్‌లో సరుకుగా విద్య మారిందని వాపోయారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్, బాధ్యులు సూరం అనూష, ఇస్మాయిల్, పరిమళ, జస్వంత్, అరుణ్, ఈశ్వర్, మడికొండ ప్రశాంత్, హిమంత్ పాల్గొన్నారు.

యూటర్న్ వద్ద చెట్టుకొమ్మల తొలగింపు

సాక్షి స్పందన


చెట్ల కొమ్మల తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

హన్మకొండ (పరకాల): సాక్షిలో ఈనెల 21వ తేదీన 'యూటర్న్ యమ డేంజర్' కథనంపై పరకాల మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. యూటర్న్ వద్ద చెట్టుకొమ్మలను తొలగించారు. దింతో వాహనదారులు మున్సిపల్ అధికారులకు, సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే యూటర్న్‌ల వద్ద ఫ్లెక్సీలు కట్టకుండా, పశువులు సేద తీరకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్తంగా

రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ



దామెర : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీలో రుణాలు మాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) అల్లే రాకేశ్ తెలిపారు. కోగిల్వాయి, వెంకటాపూర్, ఒగ్లాపూర్‌లో రైతుల నుంచి శుక్రవారం ఫిర్యాదులు స్వీకరించినట్లు చెప్పారు. శనివారం సింగరాజుపల్లి, ఊరుగొండ, పసరగొండలో, 27న (మంగళవారం) ముస్త్యాలపల్లి, 28న(బుధవారం) ల్యాదెళ్ల, 29న(గురువారం) దామెరలో ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఏఈఓలు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. రుణమాఫీ పొందని రైతులు ఫిర్యాదు అందించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ బగ్గి రమేశ్ తండ్రి సంవత్సరీకం శుక్రవారం జరిగింది. మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుర్రం రవీందర్, నాయకులు నిమ్మల మహేందర్, తోకల సమ్మిరెడ్డి, యూత్ నాయకులు బేరుగు రాకేష్, అరికెళ్ల విజయ్, అశోక్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ (పరకాల): ఉత్తర భారత్ నుంచి అంతర్రాష్ట్ర దొంగల ముఠా పరకాలలో సంచరిస్తున్నట్లు సమాచారం వచ్చిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరకాల సీఐ వి.క్రాంతికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటి యాజమానులు ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు కానీ, వేరే ఊరికి వెళ్తే నమ్మకమైన పక్క ఇంటి వారికి, పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే 8712685224 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

హాస్టళ్ల తనిఖీ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లను తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. బీసీ హాస్టల్‌లో 43మంది విద్యార్థులకు 17 మంది హాజరయ్యారు. బీసీ హాస్టల్ వార్డెన్ రవికుమార్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. అలాగే ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులు లేకపోవడంతో హాస్టల్ తెరుచుకోలేదు. హాస్టళ్ల వివరాలను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు వారు తెలిపారు.

ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించిన అధికారులు



ఆత్మకూరు : మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న మహిమాన్విత మహాదేవ పంచకూట శివాలయాన్ని శుక్రవారం పంచాయతీరాజ్ డీఈ భానుకుమార్, ఏఈ యుగంధర్ పరిశీలించారు. కాంపౌండ్ నిర్మాణ పనులను గురించి అడిగితెలుసుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వంగాల బుచ్చిరెడ్డి, సభ్యులు సాంబరెడ్డి, రఘు, కిశోర్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, సంపత్, సత్యనారాయణ, తరుపతిరెడ్డి, సుదర్శన్, రాజేశ్‌కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గుట్కా, అంబర్ ప్యాకెట్ల పట్టివేత


అంబర్, గుట్కాప్యాకెట్లతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎరుకల నగేశ్ ఇంట్లో నిల్వ ఉంచిన రూ.2లక్షల 50వేల విలువచేసే గుట్కా, అంబర్ ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన గంప సాయినాథ్ అనే వ్యాపారికి గుట్కా ప్యాకెట్లతో సంబంధం ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. సాయినాథ్ పరారీలో ఉండగా గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిని కూడా పోలీసులకు అప్పగించామని వారు తెలిపారు. ఈ తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పోచమ్మబోనాల సందడి

దామెర : మండల కేంద్రంతో పాటు వివిధ వగ్రామాల్లో పోచమ్మ బోనాల సందడి నెలకొంది. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పులుకుర్తి, ఒగ్లాపూర్, ఊరుగొండ, ముస్త్యాలపల్లి, తక్కళ్లపహాడ్‌లో డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ మహిళలు పోచమ్మ ఆలయనికి చేరుకొని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వస్త్రాలు, కుంకుమ, పసుపు, టెంకాయలు, ధూపదీపం సమర్పించారు. మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు సమర్పించారు. డప్పుచప్పుళ్ల నడుమ మహిళలు బోనాలెత్తి ఊరుగింపుగా రాగా పండుగ వాతావరణం నెలకొంది. పోచమ్మ ఆలయానికి చేరకున్న మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

పిల్లల భవిష్యత్‌కు ఉపాధ్యాయులే పునాది

- రాష్ట్ర మంత్రి సీతక్క


బాలగంగాధర్ రాజు దంపతులను సత్కరిస్తున్న మంత్రి సీతక్క

శాయంపేట : ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైందని, ప్రతి ఉపాధ్యాయుడు తమ వృత్తిని పవిత్రంగా భావించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలగంగాధర రాజు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం శుక్రవారం జరుగగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ములుగు నియోజకవర్గం తిమ్మంపేట గ్రామానికి చెందిన దాట్ల బాలగంగాధర రాజు 34 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి ఎంతో మంది విద్యార్థులను మేధావులుగా తయారు చేశారని కొనియాడారు. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే, గురువులు విద్యాబుద్ధులు నేర్పించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దుతారని, అలాంటి బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైందన్నారు.

పిల్లల నడవడికపై కన్నేసి ఉంచాలి..

కొంతమంది విద్యార్థులు సినిమాలు, సెల్‌ఫోన్లు, వీడియోలు చూస్తూ మత్తుపదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని సీతక్క అన్నారు. కొంత మంది స్వార్థపరులు పాఠశాలలు, కళాశాల విద్యార్థులను టార్గెట్ చేసి మత్తుపదార్థాలను విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూ విద్యార్థుల నడవడికపై కన్నేసి ఉంచాలన్నారు. అనంతరం పూలమాల, మెమోంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా సీతక్కకు ఆమె పేరుతో చేసిన బాక్స్‌ను విద్యార్థులు బహూకరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని అలరించాయి.

రాజకీయ ఉనికి కోసమే బీఆర్ఎస్ ధర్నా

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి


మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదంటూ ధర్నాకు తెరలేపిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారం చేపట్టిన ఎనిమిది నెలల్లో 17వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. సాంకేతిక సమస్యతో కొంత మంది రైతులకు రుణమాఫీ కాలేదని, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, మండల స్థాయిలో రైతు వేదికలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రుణమాఫీపై శాయంపేట అంబేడ్కర్ సెంటర్‌లో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవి, కుమారస్వామి, ప్రపంచరెడ్డి, డీటీరెడ్డి, రఫీ, భిక్షపతి, శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, కుమారస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : ఏకకాలంలో రైతులందరికీ రూ.2లక్షల రుణాలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆపార్టీ మండల యూత్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో చేయని రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం 8 నెలల్లోనే చేసిందన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం


ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంతరిక్ష దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తాము తయారు చేసిన ఎగ్జిబిట్లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మీస రాజమల్లయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్‌ను నిత్యజీవితానికి అనుసంధానం చేసుకుని సైన్స్ పట్ల అభిరుచిని పెంచుకోవడంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసి ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ఎంతగానో ఆలోచింపజేసేలా ఉన్నాయని కొనియాడారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా నిలుస్తాం

- సఖి సెంటర్ అడ్మిన్ హైమావతి


మాట్లాడుతున్న హైమావతి

హన్మకొండ (పరకాల) : మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను నియంత్రించేందుకు సఖి కేంద్రం కృషి చేస్తోందని సఖి సెంటర్ అడ్మిన్ హైమావతి అన్నారు. పరకాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన కల్పించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు ఐదుర కాల సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు సహాయక చర్యలతో పాటు తాత్కలిక న్యాయ సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలు అందిస్తున్నామన్నారు. పనిచేసే చోట మహిళలు లైంగిక వేధింపులుకు, అత్యాచారాలకు గురైతే రక్షణ కల్పించేందుకు సఖి సెంటర్ దోహదపడుతుందన్నారు. బాధిత మహిళలకు సఖి సెంటర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే సంప్రదించాలని సూచించారు. సఖి సెంటర్ సభ్యురాలు హరిత పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి


ఎంజేపీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ గుండె బాబు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల హాస్టల్‌తో పాటు బీసీ బాలుర వసతి గృహం, అంబాల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా హాస్టళ్లలోని వసతులను, వంట సామగ్రి, కూరగాయలు, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయా హాస్టళ్లలోని వసతుల కల్పనపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత హాస్టల్ వార్డెన్, సిబ్బందిపై ఉందన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని అన్నారు. ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో మరుగుదొడ్లు, ఇతర సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వార్డెన్లు, విద్యార్థులు, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.